తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శనివారం
06.12.2025
Follow :



# మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాత శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- అభ్యంతరాల పరిష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూ సేకరణ
- బైపాస్ రోడ్డు ఎంజాయ్ మెంట్ సర్వే ను పరిశీలించిన కలెక్టర్
- మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం
- రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,డిసెంబర్ 05(జనంసాక్షి) : ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం పెద్దపల్లి పట్టణంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతతూ గైనకాలజిస్ట్ ఔట్ పేషెంట్ వద్ద సీటింగ్ సామర్థ్యం పెంచాలని, గర్భిణీ మహిళలు నిలబడాల్సిన అవసరం రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఫార్మసీ స్టోర్ లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎం.సి. హెచ్ నందు గర్భిణీ మహిళలకు , పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏవైనా పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**అభ్యంతరాల పరిష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూ సేకరణ**

అభ్యంతరాల పరిష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూ సేకరణ జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం చేపట్టిన ఎంజాయ్మెంట్ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం బైపాస్ రోడ్డు మంజూరు చేసిందని, బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరించిన తర్వాతే భూ సేకరణ జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెరుగైన పరిహారంతో రైతులను ఒప్పించిన తర్వాతే భూ సేకరణ జరుగుతుందని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఇన్చార్జి తహసిల్దార్ విజేందర్, సర్వేయర్ లు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం**

మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన కొణిజెటి రోశయ్య వర్దంతి కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజా తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య

మిగతా 2లో..



## అక్రమ ఇసుక తరలింపుపై
# అధికారుల కొరడా
### రికార్డ్ అసిస్టెంట్‌కు ఛార్జ్ మెమో జారీ

**వేములవాడ,డిసెంబర్ 5 (జనంసాక్షి):**వేములవాడ పట్టణ పరిధిలో పలు ప్రభుత్వ పనులకు తరలించేందుకు అనుమతి పొందిన ఇసుక ట్రాక్టర్లు అక్రమ వ్యాపారానికి తెరలేపిన వ్యవహారంపై అధికారులు కొరడ జలిపించారు. వేములవాడలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల లైబ్రరీ పనుల నిమిత్తం అనుమతి పొంది రెడీమిక్స్ ప్లాంట్ లో ఇసుకను అక్రమంగా డంప్ చేయడానికి తీవ్రంగా పరిగణించారు. దీంతో మైనింగ్ ఆర్ ఐ సైదులు వేములవాడ పట్టణంలోని లైబ్రరీ భవన నిర్మాణ పనులను పరిశీలించడమే కాకుండా అక్రమంగా తరలించిన రెడీమిక్స్ ప్లాంట్ తదితర ప్రాంతాలను ఆయన రెవిన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తరలించిన ట్రాక్టర్ ను కూడా రెవిన్యూ అధికారులు కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు. సంబంధిత ట్రాక్టర్ పై పోలీస్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.వేములవాడలో ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో తాసిల్దార్ కార్యాలయంలోని రికార్డు అసిస్టెంట్ నిరంజన్ కు ఛార్జ్ మెమో జారీ చేశారు. ప్రభుత్వ అనుమతుల పేరిట ఇసుక అనుమతి పొంది ఇతర ప్రాంతాల్లో అక్రమంగా విక్రయించడం పట్ల చార్జి మెమో జారీ చేసి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కు పంపినట్లు వేములవాడ ఆర్డిఓ రాధా బాయ్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు పొంది ఇకపై ప్రైవేటుగా విక్రయాలు జరిపిన, అక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని ఆర్డిఓ హెచ్చరించారు.

# ఎన్నికల కోడ్ మరిచిన అధికారులు

### బేగంపేట ఐకెపి సెంటర్ చుట్టు మంత్రి శ్రీధర్ బాబు ఫ్లెక్సీలు .

రామగిరి, జనంసాక్షి:బేగంపేట గ్రామంలో తాజాగా ప్రారంభించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంత్రి శ్రీధర్ బాబు చిత్రాలు, ఫ్లెక్సీలు కొనసాగుతుండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న ఈ సమయంలో ఇలాంటి ప్రచారాత్మక ఫ్లెక్సీలు కొనసాగడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వ్యవస్థాపకులు, అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజాప్రతినిధుల ప్రచార సామగ్రి తొలగించాల్సిన బాధ్యత ఎన్నికల శాఖ, సంబంధిత అధికారులదే

మిగతా 2లో..





# రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు..

### ఎంపికైన ఎన్టిపిసి పాఠశాల విద్యార్థులు

**గోదావరిఖని, జనంసాక్షి :**ఈ నెల రెండవ తేదీ నుంచి నాల్గవ తేదీ వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎన్. టి. పి. సి లో నిర్వహించిన " వికాసిత్ భారత్.. ఆత్మ నిర్భార్ భారత్ కోసం " ఏర్పాటుచేయబడిన పెద్దపల్లి జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన లో రామగుండం మండలంలోని , మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల దుంగ్యపల్లె ( అన్నపూర్ణ కాలనీ, ఎన్ . టి. పి. సి.) పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె. ప్రవీణ, గణితం " సబ్ థీమ్స్‌లో భాగంగా రిక్రియేషన్ మాథెమాటికల్ మోడలింగ్, సమస్య పరిష్కారం విభాగంలో జిల్లా స్థాయి జూనియర్స్ విభాగంలో "ప్రథమ స్థానంలో రాణించి " రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినందున వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు రోజున హెచ్ ఎం. రేణుకను , ప్రథమ స్థానంలో గెలుపొందిన ప్రవీనను, గైడ్ టీచర్

మిగతా 2లో..

# సైనికులూ.. మీకు జోహార్లు

### సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ బ్యూరో(జనంసాక్షి)**

సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి చేపట్టిన ర్యాలీని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఉద్దేశించిన సహాయ నిధికి విరాళం

మిగతా 2లో..

# ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### రిటర్నింగ్ సెంటర్లను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ అశ్విని తనజీ వాకాడే



**సైదాపూర్ (జనంసాక్షి):**ఎన్నికల విధుల పట్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు శుక్రవారం సైదాపూర్ మండలం లోని సోమరం,సైదాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న స్థానిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, , గుర్తుల కేటాయింపు, పోటీ చేసి అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుల నామినేషన్ దాఖలును రోజువారిగా ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.అభ్యర్థుల అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో పూర్తిగా నమోదు చేసేందుకు హెల్ప్ డెస్క్ లో అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని

మిగతా 2లో..




## 'గాయత్రి' విద్యార్థులకు బాల వైజ్ఞానిక్ ఇన్స్పైర్ అవార్డులు

పెద్దపల్లి,డిసెంబర్ 05(జనంసాక్షి) : తేదీ: 02-12-2025 నుండి 04-12-2025 వరకు ఎన్టిపిసి జ్యోతి నగర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన్ 2025 మరియు ఇన్స్పైర్ అవార్డ్స్ లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు వాటర్ కన్సర్వేషన్ మరియు మేనేజ్మెంట్ విభాగంలో జూనియర్ స్థాయిలో ఎన్. సాద్వి జెసి ఆరవ తరగతి ప్రథమ స్థానం, సీనియర్ స్థాయిలో కె శృతి ప్రియ 9వ తరగతి ద్వితీయ స్థానం సాధించి కామారెడ్డి లో జరిగే రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. ఈ ఎంపిక పట్ల గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యతోపాటు వైజ్ఞానిక రంగంలో కూడా ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని, రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రపంచాన్ని, టెక్నాలజీని ఎదుర్కొనే విధంగా విద్యార్థులను తయారు చేసే విద్యను అందిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులను అభినందించి ప్రశంస పత్రాలు, అవార్డ్స్ ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లంకి రజినీ దేవి గారు, ప్రిన్సిపాల్ విజయ్ , గైడ్ టీచర్ సదానందం మరియు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## విద్యార్థుల అక్రమ నిర్బంధాన్ని ఖండించండి

**విప్లవ రచయితల సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌బాలసాని రాజయ్య**



పెద్దపల్లి,డిసెంబర్ 05(జనంసాక్షి) : గత నెల 18నఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మారేడుమిల్లి వద్ద జరిగిన సిపిఐ (మావోయిస్టు )కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ మాడవి హిడ్మా అతని సహచరుల ఎన్కౌంటర్ ఘటనపై అధ్యయనం కోసంవెళ్లిన అఖిలభారత విశ్వ విద్యాలయవిద్యార్థులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దామనకాండను బాలసాని రాజయ్య,విప్లవ రచయితల సంఘం,కరీంనగర్ ఉమ్మడి జిల్లా తీవ్రంగా ఖండించారు.కేంద్రంలో భాగస్వామిగా ఉన్న (పిడిఎఫ్)-జనసేన పార్టీలు మోడీ అమిత్ షా ల నరమేదానికి వంతపాడుతున్నాయి. దేశంలో రోజురోజుకు రాజ్యాంగ విలువలు, హక్కులు కాలరాస్తున్నారు.విద్యార్థుల అధ్యయనం వల్ల బూటకపు ఎన్కౌంటర్ అనేది తేటతెల్లం అవుతుందనే భయంతోనే విద్యార్థులను చింతూరు పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారు. ఈ చర్య మనిషి స్వేచ్ఛ హక్కుకు భంగం కలిగించడమే. అక్రమంగా నిర్బంధించిన విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలి. విద్యార్థుల అక్రమ నిర్బంధాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరుతున్నాం.ముందుగా విద్యార్థులు తమ కార్యక్రమాన్ని ప్రకటించుకొని సంబంధిత అధికారులకుతెలియజేసిన కూడా దుర్మార్గంగా వ్యవహరించడం సిగ్గుచేటు.మాకొద్దు మాకొద్దు మావోయిస్టు లు మాకొద్దు అంటు కిరాయి మనుషుల నినాదాలు చేయడం, విద్యార్థుల పోలీస్ స్టేషన్ కు తరలించడం అంత గందరగోళం గా ఉన్నది. విద్యార్థులను వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయాలి.

## నారాయణరావు పల్లికి ఒకే ఒక్క నామినేషన్



సుల్తానాబాద్,డిసెంబర్-05(జనంసాక్షి) : మండలంలోని నారాయణరావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామిని రాజిరెడ్డి ఒకే ఒక్క నామినేషన్ దాఖలయింది. దీంతో నారాయ ణరావుపల్లి గ్రామం ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి.

# పంచాయతీ ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

**మొదటి విడత పోలింగ్ జరిగే మండలాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

మంథని,పెద్దపల్లి(జనంసాక్షి) : పంచాయతీ ఎన్నికల విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మొదటి విడత పోలింగ్ జరిగే కమాన్ పూర్ ,రామగిరి మంథని ,ముత్తారం, శ్రీరాం పూర్ మండలాల లోని ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సంబంధించి డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, జడ్పీ సీఈఓ నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలి**

పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 6న పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత పోలింగ్ సిబ్బందికి కేటాయించిన మండలంలో శిక్షణ పూర్తి అయ్యాక డిసెంబర్ 6 న



మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ స్వస్థల మండలం (ఓటు హక్కు నమోదైన) ఎంపీడీవో కార్యాలయం కు హాజరై పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగం చుకోవాలని కలెక్టర్ తెలిపారు.

**నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు**

నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ నందు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ డిసెంబర్ 6న పిఓ, ఎపిఓ లకు శిక్షణ అందిస్తున్నామని, అదే సమయంలో ఫారం 14 అందించిన ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని, పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఓటర్ వివరాలు ఓటరు జాబితాలో మార్క్ చేయాలని అన్నారు.జడ్పీ సీఈవో నరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టును పట్టణ పరిధిలో నిర్మించాలి



అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మాణం పెట్టలేదు.

పెద్దపల్లి పట్టణ పరిధిలోనే జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఠాకూర్ అజయ్ క్రాంతి సింగ్ నేతృత్వంలోని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ అధ్యక్షుడు లకిడి భాస్కర్ పై అవిశ్వాస తీర్మాణం పెట్టలేదని, ఆయనను తొలగించలేదని, తాత్కాలికంగా మాత్రమే అధ్యక్షుడిపై ఏదాదికాలం పాటు సస్పెన్షన్ వేటు వేశామని వివరణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా సభ్యులకు సరైన సమాచారంలేకుండా వ్యక్తిగత ప్రయోజనాలకోసం పనిచేయడం వల్లే మెజారిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి లకిడి భాస్కర్ ను అధ్యక్ష పదవి నుండి తప్పించడం జరిగిందని తెలిపారు. రాఘవాపూర్ వద్ద కోర్టు నిర్మాణం చేపట్టే తీర్మాణంపై బార్ అసోసియేషన్ సభ్యులెవరు సంతకాలు చేయలేదని, మొదటి నుండి ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అసోసియేషన్ తో సంబంధంలేని వ్యక్తులతో సంతకాలు చేయించి తీర్మాణాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర అధికారులకు మాజీ అధ్యక్షుడు లకిడి భాస్కర్ సమర్పించారని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలు చేస్తే శాశ్వత బహిష్కారానికి గురికావల్సి వస్తుందని శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఎక్కడైనా కోర్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అలా కాదని రాఘవాపూర్ లో కోర్టు ప్రతిపాదనలను అమలుచేస్తే ఎదురిస్తామని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సభ్యులు రెడ్డి శంకర్, బొంకూరి శంకర్, ఠాకూర్ క్రిష్ణ క్రాంతిసింగ్, మామిడిపల్లి శరత్ కుమార్, లవన్ కుమార్, రెడ్డి నర్సింగ్, తాని నరేష్, ఆసరి రమేష్ యాదవ్, ఉద్దండ నవీన్, పాతర్ల శివ, బొడ్డ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

**కాంగ్రెస్ బీసీ సెల్ నాయకుడు గోటికార్ కిషన్ జీ**

మంథని, (జనంసాక్షి) : గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి దోహదపడండి కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ మంథని నియోజకవర్గంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,



టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ ప్రజలను కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా అమలు చేయుటకు నీతి నిజాయితీ గల అభ్యర్థులను ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయుటకు కావలసిన నిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి పెద్ద ఎత్తున సమకూరుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించి మీ మీ గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి దోహదం చేసుకునేందుకు సహకరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సెల్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు, కాంగ్రెస్ మద్దతిస్తున్న అభ్యర్థుల వ్యతిరేకంగా పనిచేసే కాంగ్రెస్ నాయకులపై పార్టీ పరంగా చర్యలు ఉంటాయని బీసీ సెల్ నాయకుడు గోటికార్ కిషన్ జీ తెలిపారు.

## ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తో పాటు రోడ్లు భవనాల రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా ,విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్, వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రి గా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారని తెలిపారు.మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో , జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి సురేష్ , ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైనికులూ మీకు జోహార్లు

అందజేశారు. ఈ సందర్భంగా ఎన్.సీ.సీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది జిల్లా పాలనాధికారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, గౌరవ వందనం సమర్పించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో పాటు కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమవంతుగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, రేయింబవళ్లు శ్రమిస్తున్నారని అన్నారు. వారి కృషి వల్లే మనమంతా ప్రశాంత వాతావరణంలో దైనందిన జీవనాలు వెళ్లదీస్తున్నామని అన్నారు. సైనికుల త్యాగాలను ప్రతి పౌరుడు గుర్తిస్తూ, వారి పట్ల, వారి సేవల పట్ల గౌరవభావంతో మెలగాలని, సాయుధ దళాలకు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. వారి గౌరవార్థం ప్రతి ఏటా జరిపే సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి మరింత అట్టహాసంగా నిర్వహించాలని, అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ అధికారి రవీందర్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అన్నారు. ప్రతి చిన్న అంశాన్ని అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయిలో అభ్యర్థులకు వివరించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆమె వెంట తాహసిల్దార్ గుర్రం శ్రీనివాస్ గౌడ్,ఎంపీడీవో యాదగిరి రిటర్నింగ్ అధికారులు పంచాయతీ కార్యదర్శి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల కోడ్ మరిచిన అధికారులు

కాగా బేగంపేట కొనుగోలు కేంద్రంలో మాత్రం చర్యలు చేపట్టకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఫ్లెక్సీలు అధికార పార్టీకి అనుకూలంగా వాతావరణం సృష్టించే ప్రయత్నంగా కనిపిస్తోందని గ్రామస్థులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ విషయంపై వెంటనే అధికారులు స్పందించి పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కోడ్ అమలులో ఎటువంటి రాజీపడకూడదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు..

అనితకు జ్ఞాపిక, ప్రశంస పత్రంతో అభినందించారు. వీరిని జిల్లా విద్యాధికారి శారద, జిల్లా సైన్స్ ఆఫీసర్ వి. హనుమంతు, ఎం. ఇ. ఓ. జింక మల్లేశం లు ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎచ్. ఎం. రేణుక, ఉపాధ్యాయులు బేబీ రాణి, జగదీశ్వర్, శ్రీనివాస్, సాదిక్ పాషా, పద్మ, ప్రశాంతి, తోటి విద్యార్థులు ప్రవీణ విజయం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్ర స్థాయి లో కూడా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల పోషకులు ఆనందం వ్యక్తం చేశారు.



# కురు వృద్ధురాలికి కంటి చికిత్స


**ఉచితంగా అద్దాలు పంపిణీ చేసిన పెద్దపల్లి ప్రభుత్వ వైద్య అధికారులు**

**ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్**

పెద్దపల్లి (జనంసాక్షి) : జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన చికిత్స అందిస్తున్న వైద్యులు. బుధవారం తురకల మద్దికుంట (గో ల్లపల్లె) గ్రామానికి చెందిన కొండ లస్య మ్మ (105) సం. వృద్ధురాలు కంటి పరీక్ష కోసం ప్రభుత్వ హాసుపత్రి కి రాగా విషయం తెలుసుకున్న సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ అమ్మకు మెరుగైన చికిత్స అందించాలని కంటి డాక్టర్ సింధూర, సభిహ లకు సూచించగా వారు కంటి పరీక్షలు చేసి టెక్నిషియన్ బూతగడ్డ చంద్ర శేఖర్ కు ఉచితంగా అద్దాలు అందే విధంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. లస్మమ్మ వారి కుటుంబ సభ్యులు వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి కి వచ్చే రోగులకు సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ అండగా ఉండి ఏదైనా ఆపదగా ఉండేవారూ తన దృష్టికి రాగానే సత్వరమే స్పందించి ఏ విధమైన చికిత్స అవసరం ఉన్న మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచనలు ఇస్తూ, హాస్పిటల్ కు వచ్చే రోగులకు మేమున్నాము అనే నమ్మకం కల్పిస్తూ రోజు రోజుకు రోగుల సంఖ్య పెరగడంతో ఆసుపత్రి మైదానం కిట కిటలాడిపోతు ఉంది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలుమార్లు హాస్పిటల్ సందర్శించి. పేదవారికి నమ్మకం కలిగేలా చికిత్స అందించాలని, వచ్చే రోగుల సంఖ్య పెరగాలని డాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం, ఎముకలు, జీర్ణకోశ, వివిధ శస్త్ర చికిత్సలు అందించి జిల్లా కలెక్టర్ తో అభినందనలు పొందారు. ప్రజలకు మెరుగైన చికిత్స అందిస్తే తెలంగాణ రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు ప్రభుత్వం నుండి గుర్తింపు వస్తుందని పలురు అంటున్నారు.

## ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

**శ్రీకాంతాచారికి గుండేటి ఐలయ్య యాదవ్ నివాళి**



పెద్దపల్లి,డిసెంబర్ 05(జనంసాక్షి) : తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ వారి ఫోటోకి పూలమాల వేసి ,కోవత్తులతో ఘనంగా నివాళులర్పించారు. సబ్బెడ చంద్రకళ , గోగుల రాజిరెడ్డి ,డా. మంద భాస్కర్ యాదవ్ ,తాడూరి శ్రీమన్ , దామ సదయ్య , సిలివేరి సుధాకర్ ,బోర్ల ధనంజయ్ , తీట్ల మల్లేశం ,ములుగురి నర్సయ్య ,చంటి నరసక్క , ఎండి ఖతిజ , గడ్డం లక్ష్మి , పద్మ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ నాయకుల ముందస్తు అరెస్టు



పెద్దపల్లి,డిసెంబర్ 05(జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ పర్యటనను దృష్టిలో ఉంచుకొని పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా బీసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపు లోకి తీసుకున్నారు. వారిలో బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అశోక్ పటేల్, యూత్ జనరల్ సెక్రటరీ చర్లపల్లి రాజు గౌడ్లు ఉన్నారు.

# కోర్టు స్థల వివాదం చుట్టూ రాజకీయ కుట్ర

**- బార్ అసోసియేషన్ కు నేనే అధ్యక్షుడిని: లకిడి భాస్కర్**

**- వర్గ పోరుకు కోర్టు స్థల వివాదమే కారణం**

**- అధ్యక్షుడి సస్పెన్షన్ చట్ట విరుద్ధం**



పెద్దపల్లి,డిసెంబర్ 05(జనంసాక్షి) : పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్‌ను తొలగిస్తూ కొందరు కార్యవర్గ సభ్యులు,ప్రధాన కార్యదర్శి కలిసి చేపట్టిన అవిశ్వాస తీర్మానం మరియు సస్పెన్షన్ ప్రక్రియపై తీవ్ర దుమారం చెలరేగింది. ఇది పూర్తిగా అక్రమం అని,అసోసియేషన్ బైలాకు విరుద్ధమని అధ్యక్షుడు లకిడి భాస్కర్ స్పష్టం చేశారు. జిల్లా కోర్టు స్థల కేటాయింపు వివాదాన్ని అడ్డుపెట్టుకుని కొందరు సీనియర్ సభ్యులు తనపై రాజకీయ కుట్ర పన్నుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టు వద్ద సీనియర్ సభ్యులు దొంతి కిష్టయ్య,కోశాధికారి గౌరిశెట్టి సత్యనారాయణ,లైబ్రరీ సెక్రెటరీ పుట్ట రవితో కలిసి మీడియాతో మాట్లాడుతూ జిల్లా కోర్టు భవనం కోసం కన్నాల వద్ద స్థలం కేటాయింపును గతంలో వ్యతిరేకించామని, పెద్దపల్లిలో స్థలం దొరకకపోవడంతోనే ప్రభుత్వం రాఘవపూర్ వద్ద 10 ఎకరాలు కేటాయించిందని,ఇది 114 మంది సభ్యుల సంతకాలతో 2023 లోనే ఆమోదించబడిందని వివరించారు. ఈ వివాదం కారణంగా కోర్టు భవనం కోసం మంజూరైన రూ. 81 కోట్ల నిధులు వెనక్కివెళ్ళోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన వరుస విజయాలను జీర్ణించు కోలేని కొందరు,తాను బలహీన వర్గాల నుంచి వచ్చాననే ఏకైక కారణంతో అణగదొక్కాలని చూస్తున్నారని, తనపై అవిశ్వాసం బైలాలో లేదని,తాను మార్చి 31 వరకు అధ్యక్షుడినే అని తేల్చిచెప్పారు. ఈ అక్రమ చర్యకు పాల్పడిన వారిపై హైకోర్టులో లీగల్ చర్యలు తీసుకుంటానని,ఇప్పటికే బార్ కౌన్సిల్‌కు, డీజేకు ఫిర్యాదు చేశానని ప్రకటించారు. అనంతరం సీనియర్ సభ్యులు దొంతి కిష్టయ్య,గౌరిశెట్టి సత్యనారాయణ,పుట్ట రవి మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని,అడ్వకేట్ యాక్ట్‌కు వ్యతిరేకమని, అధ్యక్షుడిని సస్పెండ్ చేసే లేదా సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం కార్యవర్గానికి లేదని స్పష్టం చేశారు. కొత్త కోర్టు కాంప్లెక్స్ కోసం రాఘవపూర్‌ను ఎంచుకున్న నిర్ణయం హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా తీసుకున్న మంచి నిర్ణయమని,ఈ తీర్మానంపై ప్రస్తుతానికి వ్యతిరేకిస్తున్న సభ్యులు కూడా గతంలో సంతకాలు చేశారని తెలిపారు. ఈ చర్యలన్నీ అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్నారని,పెద్దపల్లి బార్ అసోసియేషన్ చరిత్రలో అధ్యక్షుడిని ఈ విధంగా తొలగించడం ఇదే తొలిసారి అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన లకిడి భాస్కర్ అతని కాల పరిమితి వరకు కొనసాగుతారని, అప్పటివరకు తొలగించే హక్కు లేదని తేల్చి చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి చట్ట విరుద్ధ చర్యలు చేపడితే తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొండ బత్తుల ఆంజనేయులు, ప్రసాద్ రావు,సొల్లురి మల్లేశం,డివిఎస్ మూర్తి,అమీర్ శెట్టి కృష్ణ,రాజు కార్తీక్,రాజేందర్,బండారి రమేష్,కుంభం సంతోష్, ప్రవీణ్ రావు,రఘువీర్,గడ్డి సదానందం, రాచూరి శ్రీకాంత్,వంశీకృష్ణ తదితరులు పాల్గొని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ కు మద్దతును ప్రకటించారు.



# వేములవాడలో భారీ అగ్ని ప్రమాదం

**- సుమారుగా 70 క్వింటాళ్ల పత్తి దగ్ధం..**

**- షార్ట్‌సర్క్యూటే ప్రమాదానికి కారణం అంటున్న బాధిత రైతు**

**-ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు**


**వేములవాడ,డిసెంబర్ 5(జనంసాక్షి):**

వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 60 నుంచి 70 క్వింటాళ్ల వరకు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి పూర్తిగా కాలి బూడిదైంది. యాదవ సంఘం సమీపంలో నివాసముంటున్న పెరుగు జలంధర్ ఇంటిలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఇంట్లో నిల్వ చేసిన భారీ మొత్తంలో పత్తి ఉండడంతో అగ్ని వేగంగా వ్యాపించి క్షణాల్లోనే తీవ్ర రూపం దాల్చింది. అదృష్టవశాత్తు ప్రాణనష్టం తప్పింది ?ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు అందరూ బయట ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుని, సుమారు గంటపాటు శ్రమించి మంటలను పూర్తిగా నియంత్రించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు .కాలిపోయిన పత్తి విలువ సుమారుగా 60 నుండి 70 క్వింటాళ్లు ఉంటుందని అంచనా వేశారు. దీంతో రైతు జలంధర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. దీనిపై అధికారులు వెంటనే స్పందించి, నష్టపోయిన బాధిత రైతు కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేశాయి.



## ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలి

ఆర్మూర్,డిసెంబర్ 5 (జనంసాక్షి):ఆలూరు మండల కేంద్రంలోని ఏడో వార్డులో ఇండ్ల మధ్య ఉన్న కాలనీవాసులు తిరిగే రోడ్డును ఆక్రమించి మోచి సంఘం ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నందున నిలిపివేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయనుసారమై కొన్ని రోజుల క్రితం బోధన్ కార్ మధు,బోధన్ కార్ పోశెట్టి లు ఆర్మూర్ సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. పహరీ గోడ నిర్మాణం ఆపేందుకు అడ్డు వచ్చిన వారిని దౌర్జన్యంగా బెదిరింపులకు గురి చేస్తున్నారని కాలనీవాసులు వాపోయారు. పంచాయతీ సెక్రెటరీ సైతం ఇట్టి విషయంలో ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రహరి గోడను తొలగించి చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరుతున్నారు.



## రాష్ట్రస్థాయికి గట్టెపల్లి పాఠశాల విద్యార్థిని

సుల్తానాబాద్(జనంసాక్షి): రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో గట్టెపల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. నవంబర్ 28 నుండి 30 తేదీలలో హైదరాబాద్ లోని మొయినాబాద్ ఫైర్ ఫ్యాక్స్ స్పోర్ట్స్,డిసార్టో జరిగిన 12 వ తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ఇంటర్ డిస్టిక్ క్రీడల్లో పెద్దపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన సుల్తానాబాద్ మండలం లోని గట్టెపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థిని ఉమెన్స్ విభాగంలో 9 వ తరగతి మనహ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. ప్రిన్సిపాల్ వి అన్నపూర్ణ, ఫిజికల్ డైరెక్టర్ ప్రణయ్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# అరకొర వసతులు

**ఎన్నికల సిబ్బందికి నామమాత్రంగా శిక్షణ**



**వేములవాడ రూరల్, డిసెంబర్ 5 (జనంసాక్షి):**

స్థానిక సంస్థల ఎన్నికల నగార మోగడంతో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 11న నిర్వహించనున్న మొదటి విడత ఎన్నికలకు సంబంధించి వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల సిబ్బంది (ప్రిసైడింగ్ అధికారుల)కి అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల పకడ్బందీ నిర్వహణ కోసం ఈ శిక్షణలో ఎన్నికల సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలు, నిర్వహణకు అవసరమైన పత్రాలు తదితర అంశాలపై అధికారులకు శిక్షణ ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు శిక్షణకు అవసరమైన ముందస్తు ప్రణాళిక చేయకపోవడంతో అర కొర వసతులతో శిక్షణ నామమాత్రంగా కొనసాగింది. రెండు హాళ్లలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఒక హాల్లో ప్రొజెక్టర్ లేకపోవడం, పీఓ సంఖ్యకు అనుగుణంగా పీఓ డైరీలు అధికారులు అందజేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఇకనైనా ప్రణాళిక ప్రకారం అధికారులు ఏర్పాట్లు చేస్తే ఎన్నికలు సజావుగా నిర్వహించవచ్చునని పలువురు చర్చించుకుంటున్నారు.

## ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ కొరకై ఫ్లాగ్ మార్చ్



మేడిపల్లి,డిసెంబర్ 5 (జనంసాక్షి): జగిత్యాల జిల్లా లోని మేడిపల్లి మండలంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం లో ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాలమేరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిదిలోని పోరుమల్ల, కట్లకుంట,మేడిపల్లి,కొండాపూర్ గ్రామల లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల సి.ఐ సురేష్ బాబు మాట్లాడుతూ. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం స్వేచ్ఛాయుతంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. ప్రజలంతా ఎలక్షన్ సమయంలో పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్ లో మేడిపల్లి,కోరుట్ల,కథలాపూర్ ఎస్.ఐ లు శ్రీధర్ రెడ్డి, చిరంజీవి,నవీన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు రూ.5వేల విరాళం

సుల్తానాబాద్,డిసెంబర్ 05 (జనం సాక్షి) : మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామానికి చెందిన నల్ల జగన్నాథం కుమారుడు మరణించగా, దహన సంస్కారాల నిమిత్తం ఐదు వేల రూపాయలను వలస నీలయ్య అందజేశారు. నల్ల శంకరయ్య, వలస రాజమౌళి, నల్ల రాజమౌళి, నల్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# తల సేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం

## రక్తదానం చేసిన హెచ్డిఎఫ్సి బ్యాంక్ సిబ్బంది



**గోదావరిఖని, జనంసాక్షి** :హెచ్డిఎఫ్సి రామగుండం బ్రాంచ్ ఆధ్వర్యంలో తల సేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రామగుండం బ్రాంచ్ మేనేజర్ గుడిసెల శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బానోత్ శ్రీరాములు, ప్రముఖ వ్యాపారవేత్త, సీనియర్ బ్యాంక్ ఖాతాదారులు కోలేటి శ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలోని తలసేమియా వ్యాధిగ్రస్తులను కాపాడేందుకు హెచ్ డి ఎఫ్ సి సిబ్బంది చేస్తున్న చొరవ రక్తదాన శిబిరాన్ని అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ కుమారస్వామి, ఎన్టిపిసి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, సంజీవ్, నరేష్ తో పాటు బ్యాంక్ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

## ముత్తారం ఎంపీడీఓ సురేష్



**ముత్తారం డిసెంబర్ 05(జనంసాక్షి )**స్థానిక ఎన్నికలు నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ముత్తారం ఎంపిడివో సురేష్ అన్నారు. శుక్రవారం ముత్తారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం గ్రామపంచాయితీ కార్యదర్శుల తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు,సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలన్నారు.పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని నేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి చేయడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే అధికారులకు సిబ్బందికి ఇబ్బందులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బుర్ర రాజేందర్, దిలీప్,రవీందర్,ఫాయాజ్,నరేష్, సంధ్యారాణి ,నవ్య,మల్లీశ్వరి, సతీష్,తోపాటు తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదం జరిగిన పని స్థలాలను పరిశీలించేందుకు

## గనిలోకి దిగిన ఏఐటియుసి నాయకులు




**గోదావరిఖని, జనంసాక్షి :**సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె 2ఏ ఇంక్లైన్ లో గురువారం జరిగిన ప్రమాదం లో ఇద్దరు జనరల్ అసిస్టెంట్ కార్మికులు సునీంద్ర, మహేందర్ రెడ్డి గాయపడగా వారిని గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు మెరుగైన వైద్యం కోసం గోదావరిఖని ఏరియా హాస్పిటల్ డాక్టర్ లతో మాట్లాడి కరీంనగర్ లోని రెనె హాస్పిటల్ కు పంపించగా, ఈ నేపథ్యంలో శుక్రవారం గని లోకి ప్రమాదం జరిగిన పని స్థలాలను పరిశీలించేందుకు ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఫిట్ సెక్రటరీ కారంపూరి వెంకన్న, వర్క్ ఇన్స్పెక్టర్ పి.రవి లు దిగారు. వారు పని స్థలాలను పరిశీలించిన అనంతరం కార్మికుల తో, అధికారుల తో మాట్లాడిన తర్వాత ఇకముందు గనిలో ప్రమాదాలు జరుగకుండా అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కార్మికులు పని స్థలాల్లో విధులు నిర్వహించేటప్పుడు రక్షణ సూత్రాలననుసరించి పనులు చేపట్టాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి కన్నా కార్మికుల కు పని స్థలం లో రక్షణ ముఖ్యమని, ఇంకా గని లోకి దిగిన వారిలో సేఫ్టీ అధికారి జాన్సన్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థులనే అఖండ మెజారిటీతో గెలిపించాలి

## మండల ప్రజలను కోరిన

## బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు



**రాయికల్ డిసెంబర్5 (జనం సాక్షి):**కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గ్రామాల అభివృద్ధి కొరకు అనేక నిధులను కేటాయిస్తున్నారని, నిజామాబాదు పార్లమెంట్ ఎంపీ ధర్మపురి అరవింద్ కృషితో అనేక గ్రామాలలో అభివృద్ధి నిధులు కేటాయించారని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మహిళలకు పెద్దపీట వేసి అందిస్తున్నారని మేకిన్ ఇండియా స్ఫూర్తితో యువకులను శక్తివంతులుగా తయారుచేసి వారికి ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తున్నారు, అనేక సంక్షేమ పథకాలను అందించి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు, దేశంలో అన్ని రాష్ట్రాల రోడ్లను విస్తరించి, దేశంలోని అన్ని రంగాలకు అధిక నిధులను కేటాయిస్తూ రాష్ట్రాలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని, రానున్న రోజులలో మోడీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కొరకు అధిక నిధులను కేటాయిస్తారని కావున రాయికల్ మండల గ్రామాల ఓటర్లు భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల్లో నూతన వెలుగుకు శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా వారు ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలోబీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, మండల పట్టణ అధ్యక్షులు ఆకుల మహేష్, కురుమ మల్లారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ రాజనాల మధు,ప్రధాన కార్యదర్శిలు నాయకులు మచ్చ నారాయణ, సామల్ల సతీష్,అందే శంకర్, చీపెల్లి ,శేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడుంబా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



**గంభీరావుపేట డిసెంబర్ 5 (జనంసాక్షి)**బీగంభీరావుపేట మండల ంలోని సముద్ర లింగాపూర్ గ్రామంలోని మక్తా నాయక్ తండా కు చెందిన భూక్య బలరాం తండ్రితార్య, వయసు 42, కులం ఎస్టి లంబాడ అను అతడు శుక్రవారం రోజు ఉదయం తన ఇంటి వద్ద ప్రభుత్వ నిషేధించిన నాటుసారా (గుడుంబా) తయారుచేస్తుండగా నమ్మకమైన సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా అతని వద్ద ప్రభుత్వం నిషేధించిన 5 లీటర్ల గుడుంబా దొరికినాది, వెంటనే గుడుంబాను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి అతనిపై కేసు నమోదు చేయడం అని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

# అధికారులకు పంచాయతీ ఎన్నికలపై

## శిక్షణ కార్యక్రమం




**గంభీరావుపేట డిసెంబర్ 5 (జనం సాక్షి):** గంభీరావ ్రపేట మండల కేంద్రంలోని సాధారణ పంచాయతీ ఎన్నికల లో భాగంగా ము ందస్తు పిఓలకు శుక్రవా రం రోజు రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహిoచారు, ఈ కార్య్ర కమంలో ఎంపీడీవో తాసిల్దార్ మారుతి రెడ్డి, ఎంపీవో, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు,

# కళాశాలలో హార్ట్ ఫుల్ నెస్ హెల్ప్

## ప్రోగ్రామ్ ముగింపు

**ముత్తారం డిసెంబర్ 05(జనంసాక్షి)** హార్ట్ఫుల్నెస్ హెల్త్ ప్రోగ్రామ్ అనేది గుండె,మనస్సు,శరీరాన్ని సమన్వయం చేసే ప్రత్యేకమైన ప్రోగ్రామ్ అని ఇది విద్యార్థులలోని ఒత్తిడిని తగ్గించి,భావోద్వేగలకు గురికాకుండా మెరుగుపరుస్తుంది కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ తెలిపారు.శుక్రవారం ముత్తారం మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన హార్ట్ నెస్ హెల్ప్ ప్రోగ్రాం ముగిసింది అని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మెడిటేషన్ యోగ, ఇనిస్పెషన్ మోటివేషన్ క్లాసులు వినడం వల్ల విద్యార్థులు ఒత్తిడి నుండి ఇలా ఎదుర్కోవాలో తెలుస్తుందని తెలిపారు. భారతదేశంలో గొప్ప వాళ్ళ జీవిత చరిత్రతో పాటు విజయాలు సాధించిన వారి గురించి ప్రత్యేక బోధన చేయడం జరిగిందని అన్నారు. కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును ఉద్దేశించి కొన్ని రోజులుగా మెడిటేషన్ యోగ వంటి వాటిని బోధించిన సరోజన, నాగకుమారి ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ కౌన్సిలర్ జంగపెల్లి రాజేశం తోపాటు అధ్యాపక బృందం,తోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,



# పేద ప్రజల ఆప్తుడు డాక్టర్ సుధాకర్

## అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ



**బోధన్, డిసెంబర్ 5 ( జనంసాక్షి ) :** పేద ప్రజల ఆప్తుడు డాక్టర్ సుధాకర్ అని జె శంకర్ గౌడ్, సురేందర్ గౌడ్, రవిశంకర్ గౌడ్ లు స్పష్టం చేశారు. పట్టణంకు చెందిన సంస్కార్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుధాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మిత్రమండలి ఆధ్వర్యంలో అభాగ్యులకు దుప్పట్లను పంపిణీతో పాటు భోజనం అందించారు. రాత్రి యాచకులకు మరియు బీద వారికి రోడ్డు వెంబడి దుకాణ సముదాయాల ముందు ఇల్లు లేక అరుబయటే చలికి వణుకుతూ నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అలాగే మండలంలోని చింతకుంట వృద్ధ ఆశ్రమంలో అన్న వితరణ చేయడం జరిగింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటూ డాక్టర్ సుధాకర్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఈ కార్యక్రంలో అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ భూక్య సరితను

## సన్మానించిన మండల ప్రజా ప్రతినిధులు



**ముస్తాబాద్ డిసెంబర్ 5 (జనం సాక్షి)**ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మొదటి ఏకగ్రీవ సర్పంచ్ గా భూక్యా సరిత రవి నాయక్ , ఉప సర్పంచ్ వేణు, ఏకగ్రీవం ఎన్నిక ఎనిమిది మంది వార్డ్ సభ్యులు ఏకగ్రీవం అయ్యాయి, నూతన సర్పంచిని వార్డు సభ్యులను మండల ప్రజా ప్రతినిధులు శాలువతో సన్మానించారు డాక్టర్చెక్కపల్లి రాజు,

# కన్నాపూర్ సర్పంచ్ గా పుట్టపర్తిని సతీష్ ఏకగ్రీవం

**జగిత్యాల బ్యూరో డిసెంబర్ 5 (జనం సాక్షి ):**జగిత్యాల రూరల్ మండలం కన్నపూర్ గ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవంగా కావడంతో కన్నాపూర్ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి అయిన పుట్టపర్తిని సతీష్ మాట్లాడుతూ నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కన్నాపూర్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క ఇంటికి అందే విధంగా కృషి చేస్తానని, ఎవరికి ఏ ఆపద ఉన్న ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నాపూర్ యువ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.